ప్రజా
రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 224 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
గురువారం 20 మార్చి 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

ఎస్సీ వర్గీకరణపై మాట నిలబెట్టుకుంటున్నాం:చంద్రబాబు

ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని చెప్పాం.. ఆ మాట నిలబెట్టుకుంటున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అసెంబ్లీలో ఆయన ఎస్సీ వర్గీకరణపై మాట్లాడారు.

అమరావతి, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్): బుడగజంగం కులాన్ని ఎస్సీలో చేర్చాలంటూ చేసిన తీర్మానాన్ని ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనసభ తీర్మానాన్ని కేంద్రానికి పంపనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని గతంలోనే చెప్పాం.. ఆ మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. అసెంబ్లీలో ఆయన ఎస్సీ వర్గీకరణపై మాట్లాడారు. "అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే సమస్య పరిష్కారం అవుతుందని గతంలోనే చెప్పాను. జిల్లాల వారీగా కేటగిరి విభజన చేయాల్సి ఉంటుంది.

జనగణన తర్వాత మరోసారి జిల్లాల వారీగా కేటగిరిల విభజన చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" "ఏబీసీడీ కేటగిరి విభజన కోసం 1996లో కమిటీ వేశాం. ఉమ్మడి ఏపీలో రేషనలైజేషన్, కేటగిరిలపై 2000 సంవత్సరంలో చట్టం చేశాం. ఆ చట్టాన్ని కోర్టు కొట్టివేసింది. ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందేనని ఉషా మెహ్రో కమిషన్ నివేదిక ఇచ్చింది. స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లపై కూడా కమిటీ అధ్యయనం చేసింది. ఎస్సీ వర్గీకరణ సాకారం కావడంలో నా ప్రయాణం కూడా సుదీర్ఘంగా సాగింది. మొదట కమిటీ వేసినప్పటి నుంచి సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు ఉండటం నా అదృష్టం. సామాజిక న్యాయం కోసం పరితపించిన మహనీయుడు ఎన్టీఆర్. పేదల కోసం శాశ్వత గృహనివాస పథకం తీసుకొచ్చిన మొదటి వ్యక్తి ఆయన. ఎస్సీల పట్ల వివక్ష ఇంకా కొనసాగుతుండటం బాధాకరం. అంటరానితనం నిషేధానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ను నేనే వేశా. అంటరానితనం రూపుమాపడానికి ఎన్నో జీవోలు జారీ చేశాం. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ఎస్సీ, ఎస్టీ సెల్ ఏర్పాటు చేశాం. హోటళ్లు, మంచినీటి బావుల వద్ద వివక్ష పాటించకుండా చట్టపరంగా చర్యలు తీసుకున్నాం. సాంఘిక సమానత్వంపై ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహించాం.

ఆ ఘనత తెదేపాదే

లోక్సభ స్పీకర్ ఒక దళితుడిని చేసిన పార్టీ తెలుగుదేశం. స్పీకర్గా బాలయోగి ఎంతో బాగా రాణించారు. దళిత మహిళ ప్రతిభా భారతిని స్పీకర్ చేసిన ఘనత కూడా తెలుగుదేశానిదే. ఎస్సీ అయిన కాకి మాధవరావును రాష్ట్ర సీఎస్గా చేసింది తెదేపానే. నేను యునైటెడ్ ఫ్రంట్ ఛైర్మన్గా ఉన్నప్పుడు ఎస్సీ అయిన కేఆర్ నారాయణన్ను రాష్ట్రపతిని చేశాం. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కూడా ఎస్సీ, ఎస్టీలకు కీలక పదవులు ఇచ్చింది. గతంలో ఎస్సీ అయిన రామ్నాథ్ కోవిందు్ను రాష్ట్రపతిగా చేశారు. ఇప్పుడు ఎస్టీ అయిన ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిగా చేసింది. ఎస్సీ కోసం రూ.8,400 కోట్లతో ఆర్థిక చేయూత పథకాలు తీసుకువచ్చాం. గతంలోనూ మాల, మాదిగ సామాజిక వర్గాలకు దామాషా ప్రకారం నిధులు కేటాయించాం. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నా. నా రాజకీయ జీవితమంతా పేదలకు న్యాయం చేసేందుకే కృషి చేశాను. ఎస్సీ వర్గీకరణ అంశంలో మాకు సహకరించిన పవన్ కల్యాణ్కు కృతజ్ఞతలు తెలుపుతున్నా.

ఈ నెలలో పీ4 విధానం

రాష్ట్రంలో మౌలిక వసతులు పెంచేందుకు గతంలో పీపీపీ విధానం తీసుకువచ్చాను. కొత్తగా ఈ నెలలో పీ4 విధానం తీసుకురానున్నాం. ఆర్థికంగా బాగున్న వారు సమాజానికి ఎంతోకొంత తోడ్పాటునందించాలి. పేదరికంలో ఉన్న 30లక్షల కుటుంబాలను దత్తత తీసుకునే ఏర్పాట్లు చేస్తాం"అని సీఎం చంద్రబాబు అన్నారు.

మోదీ-యూనస్ భేటీ కోసం బంగ్లాదేశ్ యత్నాలు..!

ప్రధాని మోదీ, బంగ్లాదేశ్ సలహాదారు యూనస్ మధ్య భేటీ కోసం యత్నాలు మొదలయ్యాయి. దీనికి థాయ్లాండ్ రాజధాని వేదిక అయ్యే అవకాశం ఉంది. (రిపబ్లిక్ న్యూస్), మార్చి 20: భారత ప్రధాని నరేంద్ర మోదీ, బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ ల భేటీ కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. ఏడు దేశాలతో కూడిన –బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్' (బిమ్ స్టెక్) కూటమి సమావేశం సందర్భంగా వీరు చర్చలు జరిపే అవకాశం ఉంది. ఇప్పటికే ఢాకాకు చెందిన అధికారులు భారత విదేశాంగశాఖను సంప్రదించారు.

ఈ విషయంపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ విదేశాంగశాఖ సలహాదారు ఎండీ తౌహిద్ హొస్సాని ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ "బిమ్స్టెక్ సదస్సు సందర్భంగా ఇరువురు నేతల మధ్య ద్వైపాక్షిక చర్చలు ఏర్పాటుచేయడంపై.. ఇప్పటికే భారత్తో దౌత్యపరంగా సంప్రదింపులు జరిపాం" అని పేర్కొన్నారు. ఏప్రిల్ 2-4 మధ్యలో ఈ సదస్సు థాయ్లాండ్లో జరగనుంది. మరోవైపు మహమ్మద్ యూనస్ మార్చి 28న చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో భేటీ కానున్నారు. 2024 సెప్టెంబర్లో బంగ్లాదేశ్ విదేశాంగశాఖ సలహాదారు ఎండీ తౌహిత్తో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ చర్చలు జరిపారు. ఈసందర్భంగా ఇరుదేశాల దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకొనే అంశాన్ని ప్రస్తావించారు. నాటినుంచి ఇరుదేశాలు వివిధస్థాయిల్లో అధికారులు చర్చలు జరిపారు. డిసెంబర్ 9వ తేదీన విదేశాంగశాఖ కార్యదర్శులు భేటీ అయ్యారు.

బంగ్లాపై తులసీ కామెంట్స్ పై స్పందించిన అమెరికా..

బంగ్లాదేశ్లోని పరిస్థితులపై ఇటీవల తమ నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ చేసిన వ్యాఖ్యలపై అమెరికా స్పందించింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టమ్మీ బ్రూస్ మాట్లాడుతూ అమెరికా ఎలాంటి హింసనైనా.. మైనార్టీలపై వివక్షను ఖండిస్తుంది. అదే సమయంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తీసుకొన్న చర్యలను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. వాటిని తాము గమనిస్తున్నామని.. భవిష్యత్తులో కూడా ఆ దేశం వాటిని కొనసాగిస్తుందని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల భారత్ పర్యటన సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో బంగ్లా పరిస్థితులపై అడిగిన ప్రశ్నకు గబ్బార్డ్ బదులిచ్చారు. 'బంగ్లాదేశ్లో హిందువులు, ఇతర మైనారిటీల పై దాడులు జరగడం అధ్యక్షుడు ట్రంప్నకు, ఆయన పరిపాలనకు ఆందోళన కలిగించే అంశం. దీనిపై బంగ్లా తాత్కాలిక ప్రభుత్వంతో ట్రంప్ చర్చలు ప్రారంభించారు' అని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె బంగ్లాపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. వాటిని బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.

ఆ గుండె ధైర్యం ఉన్న వ్యక్తి మందకృష్ణ :పవన్ కల్యాణ్

ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయి వరకు వచ్చిందంటే మందకృష్ణ మాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

అమరావతి, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్): ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయి వరకు వచ్చిందంటే మందకృష్ణ మాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ఆయన మాట్లాడారు. మాదిగ అని చెప్పగలిగే గుండె ధైర్యం కలిగిన వ్యక్తి మందకృష్ణ. ఆ కులానికి వన్నె తెచ్చిన ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు.

"ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయి. గుర్తింపు లేని కులాలపైనా విస్తృతంగా చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ ఇచ్చిన నివేదిక చాలా అద్భుతంగా ఉంది. ఇది అందరికీ మేలు చేస్తుందని ఆశిస్తున్నా" అని పవన్ అన్నారు.

బెట్టింగ్ యాప్స్ వ్యవహారం.. రానా, విజయ్ దేవరకొండ సహా పలువురు సినీ ప్రముఖులపై కేసు

బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.

హైదరాబాద్, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్): బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ యాప్లను ప్రమోట్ చేసిన వారిలో ఉన్న ప్రముఖ నటీనటులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నటీనటులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు సహా మొత్తం 25 మంది ఈ జాబితాలో ఉన్నారు. సినీ ప్రముఖుల జాబితాలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్జ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్ ఉన్నారు.

సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లలో అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, వాసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్ఖాన్, విష్ణు ప్రియ, హర్ష సాయి, బయ్యా సన్నీ యాదవ్, యాంకర్ శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు సుప్రీత ఉన్నారు. మియాపూర్ వాసి ప్రమోద్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దొంగచాటుగా వచ్చి సంతకాలు చేసి సభకు డుమ్మానా? :వైకాపా ఎమ్మెల్యేలపై అయ్యన్న అసహనం

వైకాపాకు చెందిన ఎమ్మెల్యేలు శాసనసభకు రాకుండా సంతకాలు చేస్తుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అమరావతి, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్): వైకాపాకు చెందిన ఎమ్మెల్యేలు శాసనసభకు రాకుండా సంతకాలు చేస్తుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరవడం మీరెవరైనా చూశారా? అంటూ సభ్యులను స్పీకర్ ప్రశ్నించారు.

ఎమ్మెల్యేగా ఎన్నికైన సభ్యులు సభకు సగౌరవంగా హాజరుకావాల్సి ఉందన్నారు. వైకాపా సభ్యులు ఎవరికీ కనపడకుండా దొంగచాటుగా వచ్చి రిజిస్టర్లో సంతకాలు చేయాల్సిన పనేముందని అసహనం వ్యక్తం చేశారు. అలా వచ్చి వెళ్లడం వారి గౌరవాన్ని పెంచదన్నారు. వైకాపా సభ్యులు బాలనాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, మత్స్యలింగం, విరూపాక్ష, విశ్వేశ్వరరాజు, ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, దాసరి సుధ తదితరులు సంతకాలు చేసినట్లు తేలిందని స్పీకర్ చెప్పారు. గవర్నర్ ప్రసంగం తర్వాత వీరెవరూ సభకు హాజరు కాలేదన్నారు. వేర్వేరు తేదీల్లో వీరు రిజిస్టర్లో సంతకాలు చేసినట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. హాజరుపట్టీలో వారి సంతకాలు ఉన్నా వాళ్లు సభకు వచ్చినట్టు స్పీకర్గా తాను గుర్తించలేదన్నారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు తలవంపులు తేవొద్దంటూ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

రానున్న రెండు రోజుల్లో తెలంగాణకు వర్ష సూచన

ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

హైదరాబాద్, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్): ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వివరించారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ద్రోణి ప్రభావంతో ఉష్ణోగ్రతలు ఒకటి, రెండు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని వివరించారు.

హుండీలో నగల మూట చోరీ.. పంపకాల్లో తేడాతో బహిర్గతం

అనంతపురం జిల్లా ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నగల మూట చోరీ యత్నం కలకలం రేపింది.

ఉరవకొండ, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్): అనంతపురం జిల్లా ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నగల మూట చోరీ యత్నం కలకలం రేపింది. డిసెంబరు 7న ఆలయంలో మొక్కు తీర్చుకోవటానికి వేలూరు రంగయ్య దంపతులు వెళ్లారు. రంగయ్య తన భార్యకు ఉన్న రూ.8లక్షల విలువైన ఆభరణాలు మూట కట్టి ఆలయ హుండీలో వేశారు. ఈనెల 18న ఆలయ ఈవో రమేశ్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీ లెక్కింపు సమయంలో సిబ్బంది నగల మూటను దాచిపెట్టారు. లెక్కింపు పూర్తయ్యాక నగలను అధికారులు, సిబ్బంది పంచుకోవటానికి వ్యూహరచన చేశారు. అయితే, పంపకాల్లో తేడాలు రావటంతో కథ అడ్డం తిరిగింది. ఆలయ పూజారి ఎడుటే రంగయ్య దంపతులు హుండీలో నగల మూట వేయటం, లెక్కింపు సమయంలో కనిపించకపోవడంతో విషయం బయటకు పొక్కింది. ఈ నేపథ్యంలో అధికారి, సిబ్బంది నిన్న రాత్రి తిరిగి నగల మూటను హుండీలో వేశారు. ఈ ఘటనపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సమగ్ర వివచారణ జరిపించాలని భక్తులు డిమాండు చేస్తున్నారు.

భారత్ నా హృదయానికి సన్నిహితం:మిస్ వరల్డ్ క్రిస్టినా

భారత్లో తనకు చాలా గొప్పగా స్వాగతం పలికారని, తన హృదయంలో ఈ దేశానికి చాలా ప్రాధాన్యత ఉందని మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా అన్నారు.

హైదరాబాద్, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్): భారత్లో తనకు చాలా గొప్పగా స్వాగతం పలికారని, తన హృదయంలో ఈ దేశానికి చాలా ప్రాధాన్యత ఉందని మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా అన్నారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. భారత సంస్కృతి, కళలు చాలా గొప్పగా ఉన్నాయని చెప్పారు. ఇక్కడ స్ఫూర్తి లభిస్తోందని, విలువలు బోధిస్తారని చెప్పారు.

భిన్నత్వంలో ఏకత్వం ఎంతో గొప్ప భావన అని పేర్కొన్నారు. "ఎన్నో భాషలు ఉన్నా అంతా ఒక్కటిగా ఉండటం భారత్ స్ఫూర్తి. మిస్ వరల్డ్ కూడా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక" అని క్రిస్టినా పిస్కోవా అన్నారు.

తెలంగాణకు 2,500 ఏళ్ల చరిత్ర: స్మితా సభర్వాల్

తెలంగాణ త్రిలింగ దేశంగా ప్రాముఖ్యత కలిగిందని, ఈ ప్రాంతానికి 2,500 ఏళ్ల చరిత్ర ఉందని పర్యటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ అన్నారు. రాష్ట్రం ఏర్పడిన 11 ఏళ్లలో ఎంతో వృద్ధి సాధించామని చెప్పారు. రామప్ప, వేయి స్తంభాల ఆలయం, చార్మినార్, గోల్కొండ కోట లాంటి ఎన్నో గొప్ప కట్టడాలు ఇక్కడ ఉన్నాయని వివరించారు. మేలో మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మెడికల్ టూరిజంలో తెలంగాణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని.. సినిమా, ఆహార రంగాల్లో పెట్టింది పేరన్నారు. 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ వేదిక కానుంది. మే నెలలో హైదరాబాద్ లో పోటీలు ప్రారంభం కానున్నాయి.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- ప్రపంచ పిచ్చుకల దినోత్సవం
- 1351: ఢిల్లీ సుల్తాను ముహమ్మద్ బిన్ తుగ్లక్ మరణం.
- 1602: డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపించబడినది.
- 1726: భౌతిక శాస్త్రవేత్త, సర్ ఐజాక్ న్యూటన్ మరణం. (జననంబీ1642)
- 1951: భారతదేశపు మాజీ క్రికెట్ క్రీడాకారుడు మదన్‌లాల్ జననం.
- 1966: భారత గాయకురాలు అల్కా యాగ్నిక్ జననం. (చిత్రంలో)
- 2008: తెలుగు సినీ నటుడు శోభన్ బాబు మరణం.
- 2010: నేపాల్ మాజీ ప్రధానమంత్రి గిరిజాప్రసాద్ కొయిరాలా మరణం.

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం


ముహమ్మద్ బిన్ తుగ్లక్

ఈస్ట్ ఇండియా

ఐజాక్ న్యూటన్

మదన్‌లాల్

అల్కా యాగ్నిక్

శోభన్ బాబు


గిరిజాప్రసాద్ కొయిరాలా

'లూసిఫర్'లో ఆ సీన్‌కు రజనీకాంతే

స్ఫూర్తి:పృథ్వీరాజ్ సుకుమారన్

'లూసిఫర్ లో ఓ సన్నివేశాన్ని రజనీకాంత్ను స్ఫూర్తిగా తీసుకొని రాసుకున్నట్లు పృథ్వీరాజ్ సుకుమారన్ తెలిపారు.

మోహన్లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'లూసిఫర్2: ఎంపురాన్ (రాజు కన్నా గొప్పవాడు)'. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ముస్తాబవుతోంది. 2019లో విడుదలై బ్లాక్బస్టర్ సొంతం చేసుకున్న 'లూసిఫర్కు సీక్వెల్గా ఇది రానుంది. తాజాగా 'లూసిఫర్' లోని ఓ సన్నివేశం గురించి పృథ్వీరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. 'లూసిఫర్' సినిమా మొత్తానికి మోహన్లాల్ ఎంట్రీ సన్నివేశం హైలైట్గా నిలిచింది. ఆ సన్నివేశానికి రజనీకాంత్ స్ఫూర్తి అని దర్శకుడు తెలిపారు. "మోహన్లాల్ అంటే ఎవరో చెప్పడానికి లూసిఫర్లో ఒక్క సన్నివేశం సరిపోతుంది. ఆ ఎంట్రీ సీన్ మొత్తాన్ని రజనీకాంత్ గురించి విన్న కథను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించాను. రజనీ నివాసం ఉండే పోయోస్ గార్డెన్ వీధిలో ఎప్పుడూ ఎలా ఉంటుందో ఒక వార్తా కథనంలో చదివాను. ఆ కథనాన్ని చదివిన తర్వాత రజనీకాంత్ని స్ఫూర్తిగా తీసుకొని ఒక సీన్ రాశాను. అదే మోహన్లాల్ ఎంట్రీ సీన్. సినిమాలో దానికి మంచి ఆదరణ లభించింది" అని చెప్పారు. రజనీకాంత్కు పృథ్వీరాజ్ వీరాభిమాని అని తెలిసిందే. గతంలోనూ ఎన్నో సందర్భాల్లో రజనీకాంత్ పై తనకున్న అభిమానాన్ని వ్యక్తంచేశారు. 'లూసిఫర్ 2' ట్రైలర్ను కూడా ఆయన మొదట రజనీకాంత్కు చూపించారు. రజనీ ఈ ట్రైలర్ చూసి తననెంతో ప్రశంసించారని ఆ మాటలు ఎప్పటికీ మర్చిపోలేనని ఎక్స్లో పోస్ట్ పెట్టారు. తాను రజనీ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఒకసారి ఆ అవకాశం వచ్చినా డేట్స్ సర్దుబాటు చేయలేక డైరెక్ట్ చేయలేకపోయినట్లు తెలిపారు.

రిపబ్లిక్ సినిమా

తల్లిగా ఆ సవాల్ను ఎలా ఎదుర్కోవాలని ఆలోచిస్తున్నా :దీపికా పదుకొణె

మాతృత్వపు విరామం తర్వాత తిరిగి షూటింగ్లలో పాల్గొనడంపై దీపికా మాట్లాడారు. ఇది తనకు సవాలుగా అనిపిస్తుందన్నారు.

బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గతేడాది ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తన బిడ్డతో కొంతకాలంగా సరదాగా గడిపిన దీపికా తిరిగి షూటింగ్లలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో తల్లిగా తన కుమార్తెతో సమయం గడపడం, చిత్రీకరణలో పాల్గొనడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ఒక తల్లిగా చిత్రీకరణలో పాల్గొనడం అనేది ఎప్పుడూ సవాలే. ప్రస్తుతం నేను నా జీవితంలో మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇకపై షూటింగ్లలో పాల్గొనేందుకు సిద్ధమవ్వాలి. నా కుమార్తెకు తల్లిగా నా బాధ్యతలను నిర్వర్తిస్తూనే చిత్రీకరణల్లో పాల్గొనాలి. ఈ విషయంలో సలహాలు ఇచ్చేందుకు ఎంతోమంది మహిళలు ఉన్నారని నాకు తెలుసు. కానీ, ఇది నాకు అతిపెద్ద సవాలుగా కనిపిస్తోంది. దీన్ని ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తున్నాను. కచ్చితంగా దీన్ని ఎదుర్కొంటాననే నమ్మకం నాకు ఉంది. మాతృత్వం అనేది గొప్ప అనుభూతి. ఇది నేను ఎంచుకొనే సినిమాలపై ప్రభావం చూపుతుందని నాకు తెలుసు. నేను తల్లి కాకముందు కూడా సినిమాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకున్నాను. ఇకపై కూడా అలానే తీసుకుంటాను" అని దీపికా చెప్పారు. ఇదీ చదవండి: మీకు తమ్ముడిగా పుట్టినందుకు గర్వంగా ఉంది: చిరంజీవి పై పవన్ పోస్ట్ దీపికా చివరిసారిగా 'సింగం అగైన్'లో శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవగణ్, కరీనాకపూరాఖాన్, రణ్వీర్సింగ్, అక్షయ్ కుమార్లు కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు గతేడాది 'కల్కి 2898 ఏడీ'లో సుమతి పాత్రలో కనిపించి సందడి చేశారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.

రిపబ్లిక్ స్పోర్ట్స్

ఇప్పటికీ అతడే వేగవంతమైన వికెట్ కీపర్: రాబిన్ ఉతప్ప

చెన్నై సూపర్ కింగ్స్కు ధోనీనే బలం. అతడు జట్టులో ఉంటే చాలు ప్రత్యర్థులకు వణుకు పుడుతుంది. ఏడు లేదా ఎనిమిదో స్థానంలో వచ్చినా అతడి ప్రభావం భారీగానే ఉంటుంది.

ఎంఎస్ ధోనీ ఈసారి ఐపీఎల్లో బ్యాటింగ్ వరుసలో కాస్త ముందుకురావాలని ఇప్పటికే భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు సూచించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో మాజీ సహచరుడు రాబిన్ ఉతప్ప కూడా ఇదే విషయంపై స్పందించాడు. అదేవిధంగా ఇప్పటికీ వికెట్ల వెనక వేగవంతమైన కీపర్ కూడా ధోనీనేనని ప్రశంసించాడు. 43 ఏళ్ల మాహీ భాయ్ ఆఖర్లో బ్యాటింగ్కు వచ్చి కనీసం 12 బంతులు ఎదుర్కొంటే చాలని ఉతప్ప వ్యాఖ్యానించాడు. "ధోనీ విషయానికొస్తే ఈసారి సీజన్లో అతడి బ్యాట్ నుంచి మరిన్ని బౌండరీలు చూస్తామని అనుకుంటున్నా. గతేడాది 8వ స్థానంలో బ్యాటింగ్కు వచ్చాడు. ఈసారి కూడా అలానే రావచ్చు. ఏడో స్థానంలో వస్తే ఇంకాస్త బెటర్. ధోనీ కనీసం 12 బంతులు ఆడితే స్కోరు దూసుకుపోతుంది. ధోనీలో ఇప్పటికీ ఆటపట్ల ప్రేమ అలానే ఉంది. వికెట్ల వెనక అత్యంత వేగవంతమైన కీపింగ్ గౌవ్స్ అతడివే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ నైపుణ్యాలతో ఎంత కాలమైనా ఆడొచ్చు. అయితే, ఈ సీజన్ ముగిసిన తర్వాత వీడ్కోలు పలికినా ఆశ్చర్యపోను. అలాగే మరో నాలుగు ఎడిషన్లు ఆడినా ఆశ్చర్చపోనక్కర్లేదు" అని వ్యాఖ్యానించాడు.

వారికి ఇది అద్భుతమైన సీజన్ అవుతుంది

"భారత స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లికిది మంచి సీజన్ అవుతుందని భావిస్తున్నా. ఇప్పుడు విరాట్ ఫామ్లోనే ఉన్నాడు. బెంగళూరులో ఎప్పుడూ అతడు ప్రమాదకరమే. ఇక రోహిత్ కూడా అంతర్జాతీయ క్రికెట్తో సంబంధం లేకుండా ఐపీఎల్ లో దేంజరస్ బ్యాటర్. గతం ఎలాఉన్నా సరే.. ఈసారి సీజన్ మాత్రం వీరికి తప్పకుండా గుర్తుండిపోతుంది. ఆర్సీబీ సారథిగా రజత్ పటీదార్, దిల్లీ కెప్టెన్గా అక్షర్ పటేల్ అందరికీ తెలిసినవారే. కోహ్లి సూపర్నార్డమ్ నుంచి రజత్ బయటపడి జట్టును నడిపించాలి. దిల్లీ, బెంగళూరు మైదానాలు చాలా చిన్నవిగా ఉంటాయి. అక్కడి పరిస్థితులకు తగ్గట్టుగా కొత్త సారథులు నిర్ణయాలు తీసుకోవాలి" అని రాబిన్ ఉతప్ప వెల్లడించాడు.

అందం

చందనంతో మీ అందం రెట్టింపు, మొటిమలు, మచ్చలు, జిడ్డు లేని చర్మం కోసం ఎలా వాడాలో తెలుసా?

మొటిమలు, మచ్చలు చర్మం యొక్క సహజ మెరుపును తగ్గిస్తాయి. ఇక, వీటికి చెక్ పెట్టడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. మార్కెట్లో దొరికే ఖరీదైన ప్రొడక్ట్స్ వాడటం, బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరగడం లాంటి పనులు చేస్తుంటారు.

అందంగా ఉండాలని ఎవరూ కోరుకోరు. ప్రతి ఒక్కరు అందమైన, మచ్చల్లేని, మృదువైన చర్మం కావాలని తాపత్రయపడుతుంటారు. అయితే, ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పొల్యూషన్ కారణంగా మొటిమలు, మచ్చలు, చర్మం పొడిబారడం వంటి సమస్యలు సాధారణంగా మారాయి. మొటిమలు, మచ్చలు చర్మం యొక్క సహజ మెరుపును తగ్గిస్తాయి. ఇక, వీటికి చెక్ పెట్టడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. మార్కెట్లో దొరికే ఖరీదైన ప్రొడక్ట్స్ వాడటం, బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరగడం లాంటి పనులు చేస్తుంటారు. ఇవి ఖర్చుతో కూడుకున్న పనులు. అంతేకాకుండా దీర్ఘకాలికంలో చర్మ సమస్యలు మరింత పెంచే అవకాశం ఉంది. అయితే, కొన్ని సహజ పద్ధతుల ద్వారా మొటిమలు, మచ్చలు, పొడిబారడం వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. సహజ పదార్థాల్లో ఒకటైన చందనంతో ఈ సమస్యలకు చెక్ పెట్టవచ్చంటున్నారు నిపుణులు. పురాతన కాలం నుంచి చర్మ సంరక్షణలో చందనాన్ని ఉపయోగిస్తున్నారు. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ వంటి లక్షణాలు ఉన్నాయి. చందనాన్ని చర్మ సంరక్షణ కోసం ఎలా వాడాలో ఇక్కడ తెలుసుకుందాం.



మొటిమలకు చెక్ పెట్టడానికి గంధపు ఫేస్ ప్యాక్

ఈ రోజుల్లో చాలా మంది మొటిమలతో బాధపడుతున్నారు. వారికి గంధపు ఫేస్ ప్యాక్ బెస్ట్ ఆప్షన్. ఇందుకోసం ఒక టీ స్పూన్ చందనం పొడి తీసుకోండి. దానికి రోజ్ వాటర్ జోడించి మందపాటి పేస్ట్లా చేయండి. ఈ పేస్టుని మొటిమలపై అప్లై చేసి 15-20 నిమిషాల పాటు అలాగే ఉంచండి. ఆ తర్వాత శుభ్రమైన నీటితో ముఖాన్ని కడిగేయండి. ఈ ప్యాక్ చర్మం నుంచి బ్యాక్టీరియాను తొలగించడం ద్వారా మొటిమలు రాకుండా చేస్తుంది. చర్మాన్ని ఇన్ఫ్లమేషన్ బారి నుంచి రక్షిస్తుంది. చర్మాన్ని చల్లబర్చి మంటను తగ్గిస్తుంది.

మచ్చల కోసం చందనం ఫేస్ ప్యాక్



చర్మంపై ఉన్న నల్లటి మచ్చలు అందాన్ని దెబ్బతీస్తాయి. అందుకే వీటిని తగ్గించుకోవాలి. ఇందుకోసం ఒక టీ స్పూన్ గంధపు పొడిలో అర టీస్పూన్ పసుపు, పాలు కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి 15 నిమిషాలు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేయాలి. చందనం, పసుపు చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తాయి. ఈ ప్యాక్ మచ్చలను తొలగించడంలో సాయపడుతుంది. పాలు చర్మాన్ని తేమగా ఉంచి మృదువుగా మారుస్తుంది.

జిడ్డు చర్మానికి గంధపు ఫేస్ మాస్క్



చాలా మంది జిడ్డు చర్మంతో బాధపడుతుంటారు. జిడ్డు చర్మం వల్ల మురికి, మలినాలు పేరుకుపోతాయి. అందుకే చర్మాన్ని జిడ్డుగా లేకుండా చూసుకోవాలి. ఇందుకోసం ముల్తానీ మట్టి, నిమ్మరసాన్ని ఒక టీ స్పూన్ గంధపు పొడిలో కలపండి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని ముఖమంతా అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచండి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మంపై అదనపు నూనెను నియంత్రిస్తుంది. చర్మానికి మ్యాట్ ఫినిషింగ్ ఇస్తుంది. నిమ్మరసం చర్మ రంధ్రాల్ని బిగించి మొటిమల్ని తగ్గిస్తుంది.

పొడి చర్మానికి గంధం, తేనె ప్యాక్

ఏ సీజన్ అయినా సరే చాలా మందిని ఇబ్బంది పెడుతున్న సమస్య పొడి చర్మం. ఈ సమస్యకు చెక్ పెట్టడానికి గంధం, తేనె ప్యాక్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇందుకోసం ఒక టీస్పూన్ తేనెను ఒక టీ స్పూన్ గంధపు పొడితో కలపండి. ఈ మిశ్రమాన్ని బాగా కలపండి. ఆ తర్వాత దీన్ని ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచండి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ చర్మానికి లోతైన తేమను అందిస్తుంది. చర్మం పొడిబారకుండా కాపాడుతుంది. తేనె, గంధం చర్మాన్ని మృదువుగా చేస్తాయి.

మెరిసే చర్మం కోసం చందనం, కలబంద జెల్ ప్యాక్

మెరిసే చర్మం, రెట్టింపు అందం కోసం ఈ ప్యాక్ ఉపయోగపడుతుంది. ఇందుకోసం ఒక టీస్పూన్ గంధపు పొడిని, ఒక టీస్పూన్ కలబంద జెల్తో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇది చర్మాన్ని రిఫ్రెష్ చేసి సహజమైన మెరుపును ఇస్తుంది. కలబంద చర్మపు చికాకు తగ్గిస్తుంది. గంధం చల్లదనాన్ని అందిస్తుంది. మొటిమలు, మచ్చలు, పొడి చర్మంతో బాధపడుతుంటే గంధం వాటిని తగ్గిస్తుంది. పై చెప్పిన ప్యాక్ల్లో వారానికి రెండు మూడు సార్లు ప్రయత్నిస్తే మంచి మార్పు చూడవచ్చంటున్నారు నిపుణులు.



గమనిక:ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.